# అరుణా! అరుణా!

"ఆ రోజు అరుణతో మాట్లాడింది ఎవరు ?"

ఫ్రంట్ పేజీలో బాక్స్ ఐటమ్ చూడగానే ఉలిక్కిపడి సరిగా కూర్చుంది అరుణ. చాలా రోజుల తరువాత ఆ రోజున నీరసంగా లేదు తనకు. ఏ రోజు పేపరు ఆ రోజు కాఫీ తాగుతూ చదవటం అలవాటు. 20 రోజుల నుంచి ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలియనంత దీనంగా పడి వుంది అరుణ. అక్షరాల వెంట కళ్ళు పరుగులు తీశాయి.

"కత్తిపోట్లకు గురై హాస్పిటల్లో చేరిన స్కూల్ టీచరు 'అరుణ' కథ పాఠకులకు తెలిసిందే. స్థానిక మహిళా ప్రభంజనం వసతిగృహంలో నివసిస్తున్న కుమారి అరుణ, గురువారం ఉదయం స్కూలుకు వెళ్ళేముందు ప్రక్కన వున్న మెడికల్ షాపు నుంచి రెండుసార్లు ఫోన్లు చేసిందట! షాపు యజమాని ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. ఆ ఫోన్‌లో ఆమె మాట్లాడిన ప్రతి చిన్న అక్షరం తనకు గుర్తు ఉందని వారు చెప్తున్నారు. ఆయన చెప్పిన వివరాలను బట్టి, అరుణ 'చంద్ర' అనే వ్యక్తికి ఫోన్ చేసిందని, తనను చూసేందుకు రాలేదని ఆ వ్యక్తిపై అలిగినట్లు మాట్లాడిందని, శుక్రవారం సాయంకాలం తనను చూసేందుకు రమ్మని ఆహ్వానించిందని ఆయన చెపుతున్నారు. కుమారి అరుణ ఆ సమయంలో చక్కని నీలి రంగు దుస్తుల్లో ఆకర్షణీయంగా అలంకరించుకొని ఉందని, తరచు తన షాపు నుంచి ఎవరెవరికో ఫోన్లు చేసేదని, షాపు యజమాని చెపుతున్నారు. కుమారి అరుణకు నిందితుడితో సన్నిహిత పరిచయాలు ఉండి ఉంటాయని, స్థానికులు అనుమానిస్తున్నారు.

(వచ్చేసారి అరుణ సహ ఉద్యోగినులతో ఇంటర్వ్యూ....)

వార్త చదివేసరికి, అరుణకు ఊపిరి ఆడనంత పనయింది.... తరువాత

ఇష్యూకోసం గబగబా వెతికింది. మొదటి పేజీలోనే తన ఫోటో.... ఆల్బంలోమంచి వన్ని ఏరి తీసుకొచ్చి ఉంటారు.

**అరుణకు వివిధ యూనియన్‌లతో సంబంధం ఉందా ?**

ఈ రోజు మా విలేకరి స్థానిక ఎలిమెంటరీ స్కూలు టీచర్లతో చేసిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. కుమారి అరుణకు స్కూల్లో చాలా మంచి టీచరన్న పేరు ఉంది. పిల్లలందరికీ ఆవిడంటే గొప్ప ఆరాధనా భావం. అయితే ఆవిడతో పని చేసే టీచర్లు వెలిబుచ్చిన అభిప్రాయాలు వేరేరకంగా ఉన్నాయి. అరుణ చాలా రిజర్వుడుగా ఉండేదని, ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా, ఏవో సభలు సమావేశాలు అంటూ తిరుగుతుంటుందనీ, ఆమెకు ఎన్నెన్నో సేవా సంస్థలు, యూనియన్‌లతో సన్నిహిత సంబంధం ఉందని తెలిసింది. ఏప్రిల్ ఆరవ తేదీన జరిగిన మహిళా మండలి మీటింగ్‌లో ఆవిడ ఉపన్యాసం ఇచ్చిందని తెలిసింది. (ఆమెకు సంబంధం ఉందనుకొన్న యూనియన్లను గురించి సమగ్ర వివేదిక రేపటి రోజు అందజేయగలం సం॥)

అరుణకు అంత చలిలోనూ చెమటలుపోశాయి. చేతులు వణికిపోతున్న ఫీలింగ్ కలిగింది. తెప్పరిల్లి చుట్టూ చూసింది. అలవాటైన హాస్పటల్. కిటికీలోంచి పలకరిస్తున్న మాలతీ లత. తల తిప్పి చూస్తే పక్క వార్డులోంచి అటు ఇటు తిరుగుతున్న నర్సులు, వార్డ్ బాయిస్ అంతా సవ్యంగానే ఎప్పటిలాగే ఉంది. వణుకుతున్న చేతులతో మరో పేజీ తిప్పింది.

'అరుణకు రాడికల్స్‌తో సంబంధం ఉందా?'

నిరాసక్తంగా మరో పేజీ తిప్పింది.

**ఆ రోజు రాత్రి అరుణతో డిన్నర్ తీసుకొంది ఎవరు ?**

మరో పేజీ, మరో పేజీ ఆలోచనలు స్తంభించినట్లు అరుణ పేజీలు తిప్పుకుపోతోంది.

**అరుణతో పాటు రూమ్‌లో ఇద్దరేనా ?**

అరుణ రూమ్‌లో చాలా అందంగా తీర్చిదిద్దిన కప్‌బోర్డు, వివిధ పుస్తకాల రాక్‌లు టేబుల్ మీద ఆవిడ ఫోటోతో పాటు మరో అందమైన యువకుని చిత్రం ఉన్నాయి. ఆ యువకుడితో అరుణ చాలాసార్లు బయటకు వెళ్ళేదని అంటున్నారు. అరుణ రూమ్‌లో, టిఫిన్ బాక్స్‌లో సగం తిన్న స్వీట్స్, హాట్స్ ఉన్నాయని అవన్నీ చక్కగా సర్ది మూటలు పెట్టి ఉన్నాయని తెలిసింది. ప్రక్కనే

హోటల్ నుంచి, తెప్పించుకొన్న టిఫిన్లు తిన్న వ్యక్తి కోసం వివరాలు సేకరించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది....

అరుణకు కళ్లు తిరిగిపోతున్నాయి. జరిగిన ఆపరేషన్వుతో కోలుకోని ఆమె శరీరం షాక్ కి తట్టుకోలేకపోతోంది.

అరుణతో మాట్లాడింది ఎవరు?

డిన్నర్ తీసుకుంది ఎవరు?

అరుణ రాడికలా?

ఎన్నెన్నో ప్రశ్నలు, అరుణను ఉక్కిరి బిక్కిరి చేస్తూ

"అయ్యొయ్యో! ఎందుకు లేచావే అరుణా!

అబ్బబ్బ అప్పుడే చెత్తంతా ముందేసుకున్నావా?" చంద్ర పరుగెత్తుకుంటూ వచ్చి ఆదుర్దాగా ఆ పేపర్స్ సర్దేస్తోంది. అరుణ వెనక్కు వాలిపోయి చంద్ర వేపు చూస్తోంది. 'చంద్ర' అనే వ్యక్తా? 'అబ్బ ఎంతటి దారుణ వర్ణన.

'అదిగాదత్తా మరేమో, ఇందాకా నీ కోసం మీ ఫ్రెండ్సంతా వచ్చారు. నిన్ను డిస్టర్బ్ చేయటం ఇష్టంలేక లేపలేదు నిన్ను.... అత్తా మరేనేమో.... ఆ పధ్నాలుగేళ్ళ పసిది అత్తా అత్తా అంటూ ఆ పేపర్స్ విషయం తప్పించే ప్రయత్నం చేస్తుంటే నవ్వు వస్తోంది అరుణకు. ఆ అమ్మాయి గుండ్రని మొహాన్ని చేతులు తిప్పుతూ, చెపుతున్న తీరుని చూస్తోంది అరుణ. ఆ అమ్మాయి ఎఱ్ఱని పెదవులు కదలటం తప్ప మాటలేవీ వినబడటం లేదు అరుణకు. చేత్తో బ్రెడ్, పండ్లు, తీసుకొని భాస్కరం లోపలికి వచ్చాడు.

"అదిగో దాన్ని పలకరించకే. అలసిపోతుంది అంటున్నానా? కళ్లు మొదలెట్టేశావా? పోయి అమ్మ వెనకే ఉండిపోయింది చూడు పో. తొందరగా రమ్మను. బామ్మ నడవలేకపోతోంది పో."

చేతిలో పళ్ళు షెల్ఫ్‌లో సర్దుతున్నాడు భాస్కరం.

అందమైన కుర్రాడు....అరుణ కళ్ళముందు అక్షరాల వరసలే కదలిపోతూ.

ఈ అందమైన కుర్రాడి వెనకే...తను ఎన్నోసార్లు బజార్లో షాపింగ్‌లు పూర్తిచేసింది.

"అరేయ్ అరుణా! ఎలా వుందే! నీరసంగా ఉందా?" ఆ గొంతులో అంతులేని ఆపేక్ష. తోడబుట్టిన చెల్లెలిమీద ఆప్యాయత....భగవాన్....ఎంత దారుణం.... తెలిసీ తెలియకుండా ఊహాగానాలు చేసేసి, సర్క్యులేషన్స్ కోసం పేపర్లో వేసేసు

కోవటమేనా! కాస్తంత మానవత్వం చూపిస్తే....ఏం జరిగిందో ఓసారి తెలుసుకోనీ ఉంచే, అసలారోజు ఏం జరిగింది....

ఆ రోజు ఉదయమే సంగీత పాఠశాలకు వెళ్ళింది. నాలుగు రోజుల్లో ప్రోగ్రామ్ ఉంది. తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాల్సి ఉంది. అదే ఆలోచిస్తూ ఏమేం ఐటమ్స్ చేద్దామా? ఒక్కోటి గుర్తుతెచ్చుకొంటూ కళ్ళు మూసుకు పడుకొంది. నెమ్మదిగా ఏదో శబ్దం. కింద కిచెన్‌లోంచి శబ్దాలు వినవస్తూ సందడిగా ఉంటుంది. దాదాపు 500 మందిదాకా ఉన్న హాస్టల్ అది. నిరంతరం ఏవో పనులు. అలాగే అనుకొని కళ్ళు మూసుకొంది. కాసేపటికి అడుగుల చప్పుడు అవుతుంటే కళ్ళు తెరిచి చూస్తే ఏముంది ఇద్దరు రాక్షసుల్లాంటి వాళ్ళు. ఒకడు టార్చిలైటుతో మరోడు డ్రాయరు మీద ఉన్న వస్తువులు సర్దుకొంటూ టేప్ రికార్డర్, అలారం సంచీలో వేసుకొన్నాడు. తన హేండ్‌బాగ్ తీస్తుండగానే ఎందుకో ఒకడు వెనక్కి తిరిగి చూశాడు. కళ్ళు తెరచి తమవైపే చూస్తోన్న అరుణను చూడగానే ఒక్క దూకు దూకాడు. తను అరవబోయింది. అంతే కడుపులో, చేతిమీద, నడుం దగ్గర కత్తిపోట్లు గట్టిగా నోరు మూసేయటంతో, మూలిగేందుకుకూడా వీల్లేని పరిస్థితి. ఆ తరువాత తను కళ్ళు తెరిచింది హాస్పటల్‌లోనే. అంతమంది ఉన్న హాస్టల్లో కనీస శ్రద్ధ తీసుకోరు. సెక్యూరిటీ సరిగాలేదు. ఆ భవనం అంతంత మాత్రమే. వందలు వసూలు చేస్తూ అంత నిర్లక్ష్యంగా ఉంటే వచ్చిన ఫలితం ఇది. కానీ దీనికి ఎన్నెన్ని రంగులు. ఎంతంత ప్రచారం. రేపు తను తలెత్తుకొని బ్రతుకుతుందా? అసలు ఇంట్లో వాళ్ళంతా ఏమనుకొంటున్నారో? రేపు స్కూల్లో తను ఏం చెప్పుకోవాలి.

అరుణ బ్లడ్‌ప్రెషర్ పెరిగిపోతోంది. ఊపిరి తిప్పుకోలేకుండా అయిపోతోంది.

"అరుణా! అరుణా!"

"ఏమైందే తల్లీ అరుణా"

"అరుణా," అత్తా.

ఈ అరుపులకి, ఏడుపులకీ దూరంగా ఎవరికీ అందని సుదూర తీరాలకు అరుణ అప్పటికే చేరిపోయింది. క్షేమంగా కోలుకొని, ఆరోగ్యం పుంజుకొంటున్న అరుణకు అంత హఠాత్తుగా అంత బి.పి. ఎందుకు పెరిగిందో ఆ బలహీనమైన గుండె ఎందుకు ఆగిపోయిందో అంతు బట్టని ప్రశ్న.

(కలువబాల, డిసెంబర్ 88)